నమస్తే తెలంగాణ

# సిద్దిపేట

I | హైదరాబాద్, మంగళవారం 18 జూన్ 2024 | SIDDIPET



# విద్యాలయాల ఖిల్లాగా సిద్దిపేట

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పీజీ కోర్సులు మంజూరు
- మహిళా డిగ్రీ రెసిడెన్షియల్‌లో పీజీ కోర్సులు ప్రారంభం
- మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, జూన్ 17: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మరో రెండు పీజీ కోర్సులు మంజూరయ్యాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో ఇప్పటికే 10 పీజీ కోర్సులు ఉన్నాయని, నూతనంగా ఎమ్మెస్సీ మైక్రో బయాలజీ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో 60 సీట్ల చొప్పున ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమవుతాయన్నారు. పీజీ కళాశాలగా రూపాంతరం చెందిన మిట్టపల్లి మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ ఫిజిక్స్ కోర్సు ఈ ఏడాది నుంచే ప్రారంభించుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలనే సంకల్పంతో సిద్దిపేట నియోజకవర్గంలో రెండు మెడికల్, నాలుగు పాలిటెక్నిక్, ప్రభుత్వ డిగ్రీ, మహిళా డిగ్రీ, పీజీ నర్సింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కళాశాలలు, మోడల్ స్కూల్స్, గురుకులాలు, రెసిడెన్షియల్, పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేసి సిద్దిపేటను విద్యాలయాల ఖిల్లాగా తీర్చిదిద్దామన్నారు.

**అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలి**

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.2.50 లక్షలతో నిర్మించే అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల జాప్యంపై ఇటీవల నిర్వహించిన సమీక్షలో అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనపు తరగతి గదుల పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. సిద్దిపేట నియోజకవర్గం సరస్వతీ నిలయంగా విరాజిల్లుతుందన్నారు. విద్యాభివృద్ధికి విద్యాశాఖ, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషి చేయాలన్నారు.

# వర్షాల కోసం రైతుల ఎదురుచూపు

## సిద్దిపేట జిల్లాలో తొలకరికే 60వేల ఎకరాల్లో పత్తి సాగు

- సగానికిపైగా మొలకెత్తని పత్తిగింజలు
- పది రోజులుగా మొఖం చాటేసిన వరుణుడు
- స్ప్రింక్లర్లతో తడులు పెడుతూ పత్తి విత్తనాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్న అన్నదాతలు



సిద్దిపేట జిల్లా బూరుగుపల్లిలో స్ప్రింక్లర్లతో పత్తి గింజలకు నీళ్లు పెడుతున్న దృశ్యం



పత్తి విత్తనాలు పెడుతున్న మహిళలు

గజ్వేల్, జూన్ 17: ఈ ఏడాది వానకాలం సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలతో రైతులు ముందుగానే పత్తి విత్తనాలు పెట్టారు. భారీగా కురిసిన వర్షాలకు విత్తనాలు పెట్టిన రైతుల్లో ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో కలవరం మొదలవుతున్నది. సాగు చేసిన పత్తి విత్తనాలు అనుకున్న స్థాయిలో మొలకెత్తకపోవడంతో రైతులు దిగులు పడుతున్నారు. పది రోజులుగా సిద్దిపేట జిల్లాలో వర్షాలు కురవకపోవడంతో పెట్టిన పత్తి విత్తనాలు మొలకెత్తక చాలాచోట్ల రైతులు మొక్కలకు నీళ్లు పోయడంతో పాటు స్ప్రింక్లర్లతో పత్తిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**పత్తి సాగుకే రైతుల మొగ్గు**

సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, సిద్దిపేట, హుస్నాబాద్ డివిజన్ల పరిధిలో రైతులు వివిధ రకాల పంటలను సుమారుగా 5.50లక్షల ఎకరాల్లో సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. అయితే ప్రతి ఏడాది జిల్లాలోని రైతులు వర్షాకాలంలో ఎక్కువగా వరిని సాగు చేసేందుకు ఎక్కువగా ఆసక్తిని చూపిస్తారు. ఈసారి కూడా జిల్లాలో 3 లక్షల ఎకరాల్లో వరి, 1.80 లక్షల ఎకరాల్లో పత్తి, 60వేల ఎకరాల్లో మొక్కజొన్న, 10వేల ఎకరాల్లో కందులను సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. గతేడాది రైతులు 1.08 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేయగా ఈసారి 1.80లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేస్తారని అధికారుల అంచనా వేయగా అంతకుమించి ఎక్కువగా సాగయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతులు ఎక్కువగా బీటీ-2 పత్తి విత్తనాలనే ఎక్కువగా సాగు చేస్తున్నారు. అందుకు అనుగుణంగా మార్కెట్‌లో రైతులకు సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచారు. గతేడాది పత్తి క్వింటాలుకు రూ.7020 వరకు ధర పలకడంతో మార్కెట్‌లో డిమాండ్ ఉన్న బీటీ-2పత్తి విత్తనాలనే ఎక్కువగా రైతులు సాగు చేసేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. అదే విధంగా సిద్దిపేట జిల్లాలో జిన్నింగ్ మిల్లులు కూడా అధికంగా ఉండడంతో పత్తి పంట ఎక్కువగా సాగయ్యే అవకాశం ఉంది.

**వర్షాల కోసం రైతుల ఎదురుచూపు**

సీజన్ ప్రారంభంలో మురిపించిన వర్షాలు ప్రస్తుతం కురువకపోవడంతో విత్తనాలు వేసిన రైతులతో పాటు విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్న రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. ఎప్పుడు వర్షాలు కురుస్తాయేనని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ముందుగా కురిసిన వర్షాలతో పత్తి విత్తనాలు పెట్టిన రైతులు తర్వాత వర్షాలు కురువకపోతాయా అంటూ పత్తి పెట్టగా మొలకలు రాకపోవడంతో దిగులు పడుతున్నారు. అధికారుల అంచనా ప్రకారం సిద్దిపేట జిల్లాలో ఇప్పటికే 60వేల ఎకరాల్లో పత్తిని సాగుచేయగా, అందులో సగం వరకే మొలకలు రావడంతో మిగతావి రాకపోవడంతో రైతులు అంత వాన దేవుడిపై భారాన్ని మోపి ఎదురుచూస్తున్నారు. జిల్లాలో ఈనెలలో సాధారణం కంటే తక్కువగా వర్షాపాతం నమోదైంది. గజ్వేల్ మండల పరిధిలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన పులువురు రైతులు స్ప్రింక్లర్లతో పత్తి గింజలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మృగశిర కార్తెలో వర్షాలు ఎక్కువగా కురవకపోవడంతో కప్పతల్లి ఆట ఆడితే సమృద్ధిగా వర్షాలు కురుస్తాయనేది నమ్మకం. జగదేవ్‌పూర్ మండలం బీజీ వెంకటాపూర్‌లో సోమవారం పిల్లలు వర్షాలు కురువాలని కోరుతూ కప్పతల్లి ఆడారు.

### స్ప్రింక్లర్లతో నీళ్లు పెడుతున్నాం



పత్తి పెట్టినప్పటి నుంచి వర్షాలు కురవకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో స్ప్రింక్లర్లతో పత్తి గింజలకు నీళ్లు పెడుతున్నాం. రెండున్నర ఎకరాల్లో బీటీ పత్తి విత్తనాలు సాగు చేశా. పది రోజులుగా వర్షాలు కురవకపోవడంతో పెట్టిన పత్తి విత్తనాలను కాపాడుకునేందుకు స్ప్రింక్లర్లతో రెండు రోజులుగా నీళ్లు పెడుతున్నాం. మృగశిర కార్తెలో వర్షాలు కురుస్తాయనుకుంటే ఇప్పటికీ కురువకపోవడంతో పెట్టిన పత్తి విత్తనాలు మొలకలు రావని బోరుతో నీళ్లు పెడుతున్న. నాతోపాటు పక్కనే ఉన్న వెంకట్రామిరెడ్డి కూడా స్ప్రింక్లర్లతోనే నీళ్లు పెడుతుండు. వర్షాలు అనుకున్న స్థాయిలో కురువకపోవడంతో కష్టపడి సాగుచేసిన పత్తి పంటను ఎలాగైనా కాపాడుకోవాలే. ఇప్పుడే వర్షాలు ఇలా ఉంటే మునుముందు ఎలా ఉంటాయో?. - పడిగే ఆంజనేయులు, రైతు, బూరుగుపల్లి



జైన చౌముఖి శిల్పానికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

## 'జైన చౌముఖి' శిల్పానికి పూజలు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 17: ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి అంగడి వీరన్న ఆలయం సమీపంలోని వ్యవసాయ భూమిలో ఇటీవల 10వ శతాబ్దానికి చెందిన చాళుక్యుల కాలం నాటి జైన చౌముఖి శిల్పం లభ్యమైంది. దీంతో గ్రామస్తులు సోమవారం జైన చౌముఖి శిల్పాన్ని అంగడి వీరన్న ఆలయానికి చేర్చారు. ఈ సందర్భంగా అర్చకుడు ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు జైన చౌముఖి శిల్పానికి ప్రత్యేక పూజలు చేశారు.

## చిన్నారుల ప్రాణాల మీదికొచ్చిన కుటుంబ కలహాలు

- అభం శుభం తెలియని చిన్నారులతో పాటు ఆత్మహత్యాయత్నానికి యత్నించిన తల్లి
- ఇద్దరు కూతుళ్ల పరిస్థితి విషమం
- గాంధీలో చిన్నారులు, గజ్వేల్ దవాఖానలో చికిత్స పొందుతున్న తల్లి
- గజ్వేల్ మండలం జాలిగామలో ఘటన

గజ్వేల్, జూన్ 17: కుటుంబ కలహాలు చిన్నారుల ప్రాణాల మీదికొచ్చింది. అభం శుభం తెలియని చిన్నారులతోపాటు తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇద్దరు చిన్నారులు ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల పరిధిలోని జాలిగామలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి మానస, రాజు దంపతులకు నాలుగేండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఆనన్య(3), సహస్ర 11నెలల ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుటుంబ కలహాలతో తల్లి మానస ఇద్దరు కూతుళ్లకు చున్నికట్టి నీటి సంపులోకి ముంచుతూ పైకి లేపడంతో వారు అపస్మారక స్థితిలోకి చేరుకోగానే వారిద్దరినీ పైకి తీసింది. అనంతరం ఇంట్లో తల్లి మానస ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి విఫలమైంది. దీంతో వెంటనే పక్కింటికి వెళ్లి విషయం తెలిపింది. గమనించిన స్థానికులు వెంటనే 108కి సమాచారం అందించి గజ్వేల్‌లోని దవాఖానకు తల్లితో పాటు ఇద్దరు కూతుళ్లను తరలించారు. ఇద్దరు చిన్నారులు అపస్మారక స్థితిలో ఉండగా పరిస్థితి క్షీణించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. గాంధీలో చికిత్స పొందుతున్న ఇద్దరు అక్కాచెల్లెండ్ల పరిస్థితి విషమంగా ఉంది. అయితే ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తల్లి మానస గజ్వేల్ దవాఖానలో చికిత్స పొందుతుండగా ఆమెకు ఎలాంటి ప్రాణహాని లేదని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని ఇంట్లో పరిస్థితిని గమనించి వివరాలు సేకరించారు.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్

- ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- సిద్దిపేట ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు
- శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు



పటాన్‌చెరు: బక్రీద్ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని కలిసిన మైనార్టీలు



కోహీర్: దిగ్వాల్‌లో బీఆర్‌ఎస్ నాయకులకు బక్రీద్ శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



సిద్దిపేట: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్





హుస్నాబాద్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జూన్ 17: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాల్లో బక్రీద్ పండుగను ముస్లింలు సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని ఈద్గాలో పట్టణం నుంచే కాకుండా వివిధ గ్రామాల నుంచి వచ్చిన ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మార్నింగ్ వాక్‌లో ఉన్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పలువురు ముస్లింలను స్వయంగా కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గా వద్ద ప్రార్థనల అనంతరం మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు అలయ్‌బలయ్ తీసుకొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**పటాన్‌చెరులో...**

పటాన్‌చెరు, జూన్ 17: త్యాగానికి ప్రతీక బక్రీద్ అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిఒక్కరూ బక్రీద్‌ను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

**సిద్దిపేటలో..**

సిద్దిపేట, జూన్ 17: త్యాగాల పండుగ బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని సిద్దిపేట ఎక్బాల్ మినార్ వద్ద ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు అలయ్ బలయ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్‌కు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి, కరుణకు ప్రతీకగా బక్రీద్ నిలుస్తుందన్నారు. బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఉదయం ఈద్గా మైదానానికి భారీగా చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

**గజ్వేల్‌లో...**

గజ్వేల్, జూన్ 17: త్యాగానికి ప్రతీకైన బక్రీద్‌ను ముస్లింలు గజ్వేల్‌లో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ముస్లింలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మజీద్ కమిటీ అధ్యక్షుడు యూసుఫ్, కౌన్సిలర్ మెట్టయ్య, నాయకులు గుంటుక రాజు, గంగిశెట్టి రవీందర్, కనకయ్య, దుర్గాప్రసాద్, రియాజ్, స్వామిచారి పాల్గొన్నారు. కర్బూజపై గజ్వేల్‌కు చెందిన రామకోటి రామరాజు మజీద్, నమాజ్ చేస్తున్న ఇమామ్ చిత్రాన్ని రూపొందించాడు.



గజ్వేల్: గజ్వేల్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి



సిద్దిపేట: సిద్దిపేట ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు





సిద్దిపేట: ఎక్బాల్ మినార్ వద్ద ముస్లింల సందడి

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం దొంతిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



హుస్నాబాద్‌లోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



హుస్నాబాద్: ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు చెప్తున్న మాజీ ఎంపీపీ



మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



విరిగిపోయి ఉన్న సంగారెడ్డిలోని రాజీవ్ పార్కులోని ఓపెన్ జిమ్ పరికరాలు



# ఓపెన్ జిమ్.. నిర్వహణ నిల్

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా బీఆర్‌ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ల నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. దీంతో వ్యాయామం చేసేందుకు వచ్చిన వారికి అసౌకర్యం తప్పడం లేదు. సంగారెడ్డి పట్టణంలోని రాజీవ్‌పార్కులో ఏర్పాటు చేసిన వ్యాయామ వస్తువులు దెబ్బతిని మూలకు పడ్డాయి. వాటికి మరమ్మతులు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. సంగారెడ్డిలోని మహబూబ్ సాగర్ చెరువు కట్టపైన ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో కూడా వ్యాయామ వస్తువులు దెబ్బతిన్నాయి.

–సంగారెడ్డి ఫొటోగ్రాఫర్, జూన్ 17



సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువు కట్టపై ఓపెన్ జిమ్ దుస్థితి